
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 3
జిల్లాల వార్తలు
శనివారం 8 మార్చి 2025







ఆమె.. అన్నింటా..

నేడు అంతర్జాతీయ మహిళాదినోత్సవం

ఆమె లేని సమాజాన్ని ఊహించలేం. మానవ మనుగడకు ఆమె ఆధారం. ఆమెతోనే సృష్టి పరిపూర్ణం. ఆకాశంలోనే కాదు.. అవకాశాల్లోనూ ఆమె సగం. రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మేముసైతం అంటూ నేటి మహిళలు దూసుకుపోతున్నారు. అన్ని రంగాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. హోంమేకర్ అయినా.. అంతరిక్షంలో దూసుకెళ్లిన సునీతా విలియమ్స్ అయినా.. ఆమె పాత్ర మరువలేనిది. నేటి మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో పురుషులతో పోటీ పడుతున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల విజయగాథలు...

5 లో



సిమెంట్ లైనింగ్ కోసం కాల్వలో పొదలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ప్రతీ బొట్టు పొలానికే..

- సింగూరు కాల్వలకు సీసీ లైనింగ్ షురూ
- రూ. 133.35 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- 82 కి.మీ. మేర కాల్వలు ఇక పటిష్టం
- నీటి ప్రవాహానికి తొలగనున్న అడ్డంకులు
- పనుల నేపథ్యంలో పంట విరామం

జోగిపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సింగూరు కాల్వలు మరింత పటిష్టంగా మారనున్నాయి. కాల్వలకు సీసీ లైనింగ్ పనులు ప్రారంభమయ్యాయి. అందోలు నియోజకవర్గంలోని అందోలు, పుల్కల్, చౌటకూరు, మునిపల్లితో పాటు, సంగారెడ్డి నియోజకవర్గంలోని సదాశివపేట మండలం ఆత్మకూరు వరకు సీసీ లైనింగ్‌తో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగనున్నాయి.

82 కిలోమీటర్ల మేర..

సింగూరు ప్రాజెక్టు నుంచి అందోలు నియోజకవర్గంలోని అందోలు, పుల్కల్, చౌటకూరు, మునిపల్లి మండలాల్లో సాగు అవసరాలకు ప్రతీ ఏటా 2 టీఎంసీల నీటిని ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఇందుకోసం సింగూరు ప్రాజెక్టు నుంచి అందోలు వరకు 24 కిలోమీటర్ల పొడవైన మెయిన్ కెనాల్‌ను నిర్మించారు. దీనికి అనుబంధంగా పుల్కల్ మండలంలోని సింగూరు నుంచి చౌటకూరు మండలం శివంపేట వరకు 24 కి.మీ. పొడవైన ఎడమ కాల్వను, మునిపల్లి మండలం బుస్సారెడ్డిపల్లి నుంచి సదాశివపేట మండలం ఆత్మకూరు వరకు 12 కి.మీ. మేర కుడికాల్వను ఏర్పాటు చేశారు. ఎడమ, కుడి కాల్వల నుంచి మరో 22 కిలోమీటర్ల పొడవైన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌ను నిర్మించారు.

సీసీ లైనింగ్‌తో పటిష్టం

సింగూరు నుంచి ప్రధాన కాల్వతో పాటు కుడి, ఎడమ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు సీసీలైనింగ్ చేయకపోవడంతో వర్షాలు, నీటి ప్రవాహం కారణంగా పూడిక చేరి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు నుంచి 2 టీఎంసీల నీటిని విడుదల చేసినా నీరంతా ఆయకట్టుకు చేరకపోయేది. ఈఆటంకాలను తొలగించడం కోసం కెనాల్స్ అన్నీ కలిపి మొత్తం 82 కి.మీ. మేర కాంక్రీట్ లైనింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ. 133.35 కోట్లకు టెండరు ఖరారైంది. సివెట్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరును దక్కించుకుని పనులు ప్రారంభించింది. తొలిదశలో కాల్వలల్లో పూడిక, పొదలు తొలగిస్తున్నారు. రెండో దశలో కాల్వలకు సీసీ లైనింగ్ చేస్తారు.

యాసంగికి నీటి విడుదల లేనట్టే

కాల్వలకు సీసీ లైనింగ్ పనుల నేపథ్యంలో యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించారు. గత డిసెంబరులో సంగారెడ్డిలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ మీటింగ్‌లో సభ్యుల సూచన మేరకు కలెక్టర్ క్రాంతి ఈమేరకు నిర్ణయం ప్రకటించారు. దీంతో, ఈ సీజన్లఓ నీటిని విడుదల చేయరు.



ముళ్ల పొదలతో నిండిపోయిన సింగూరు ప్రధాన కాల్వ

ఏడాదిన్నరలో పనులు పూర్తి చేయాలి



సింగూరు ప్రధాన కాల్వతో పాటు కుడి, ఎడమ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు 82 కిలోమీటర్లమేర సీసీ లైనింగ్ పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. కాల్వల్లో పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు, పూడిక తొలగించే పనులు ప్రారంభించారు. త్వరలోనే కాల్వ అడుగున కాంక్రీట్‌తోబెడ్ వేసి కాల్వల రెండు గట్లకు ఫుల్ సప్లై డెప్త్‌లో కాంక్రీట్ లైనింగ్ ఏర్పాటు చేస్తారు. ఈ పనులను కాంట్రాక్టు మొదలైన నాటి నుంచి ఒకటిన్నర సంవత్సరాల్లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

-నాగరాజు,
ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ

నా పేరులోనే విప్లవముంది

- అదే స్ఫూర్తితో మహిళా సాధికారతకు అంకితం
- డ్రైవింగ్‌తోపాటు అనేక రంగాల్లో మహిళలకు శిక్షణ ఇప్పించాం
- వారే స్వయంగా పెట్రోల్‌బంకును నిర్వహించేలా ప్రొత్సహించాం
- 'కస్తూర్బా', గురుకుల విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గం వేస్తున్నా
- అమ్మాయిలపై వివక్ష తగదు.. తల్లిదండ్రుల్లోనూ మార్పు రావాలి
- టీనేజ్‌లో ఆకర్షణలు కాదు.. ఆశయసిద్ధి ఉండాలి
- కుటుంబ సహకారం, పట్టుదలతోనే లక్ష్యాన్ని చేరుకున్నా
- 'ఆంధ్రజ్యోతి'తో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 7: 'క్రాంతి అంటే రెవల్యూషన్.. నా పేరులోనే విప్లవం ఉంది.. ఏదైనా ఆ స్ఫూర్తితోనే మహిళల్లో చైతన్యాన్ని.. విద్యార్థినుల్లో లక్ష్యసిద్ధిని రగిలిస్తున్నాను. స్వయంకృషితో వారు ముందడుగు వేస్తుంటే చెప్పలేని సంతోషంగా ఉంది. నాకు ఇంతకన్నా సంతృప్తి ఇంకేం ఉంటుంది. వారి కళ్లలో కనిపిస్తున్న ఆనందం నాకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తోంది. మహిళల అభివృద్ధి కోసం ఇంకేదైనా గొప్ప మార్పు తేవాలనే దిశగా నాలో ఆలోచనలు రేకెత్తుతున్నాయి'.. అంటూ సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు మనసులోని మాటలు వెలిబుచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు. ఆమె మాటల్లోనే..

తల్లిదండ్రుల్లో మార్పు రావాల్సిందే

ఇప్పటికీ కొంతమంది తల్లిదండ్రులు అమ్మాయిలంటే తక్కువగా చూస్తారు. అబ్బాయిల కంటే అమ్మాయిలను తక్కువ చదివిస్తారు. ఈ ధోరణి మారాలి. బాలికలకు చదువుతోపాటు ఆర్థిక స్వేచ్ఛను అందించాలి. చిన్ననాటి నుంచే అబ్బాయిలతో సమానంగా చూడాలి. ఇద్దరు అమ్మాయిలే ఉంటే ఎప్పటికప్పుడు వారిని ప్రొత్సహిస్తూ ఉండాలి. అమ్మాయిలు ఏ విషయంలోనూ తక్కువకాదని మనోధైర్యం నింపాలి. తల్లిదండ్రుల్లో మార్పు వస్తేనే ఇది సాధ్యమవుతుంది. తల్లిదండ్రుల సహకారం ఉంటే పెళ్లయిన తర్వాత భర్త, అత్తామామలు కూడా సహకరిస్తారు.

యుక్తవయసులో జాగ్రత్తగా ఉండాలి

అమ్మాయిల ఉజ్వల భవిష్యత్తుకు 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు సరైన సమయం. ఈ వయసులో చదువు మీదనే దృష్టి పెట్టాలి. లక్ష్యాన్ని పెట్టుకొని చదవాలి. తెలిసీతెలియక చేసే పొరపాట్లు జీవితాలను నాశనం చేస్తాయి. ఈ రోజుల్లో ఎంతోమంది పేద అమ్మాయిలు ఉన్నత ఉద్యోగాలు దక్కించుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. అలాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలే తప్ప.. చదువుకునే సమయంలో ఆకర్షణలకు లోనైతే చేతులారా భవిష్యత్తును కాలరాసుకున్నట్లే అవుతుంది.

నాకు ప్లాన్-ఏ మాత్రమే ఉంది

మా తల్లిదండ్రులు, సిస్టర్ అందరూ డాక్టర్లే. కానీ నాకు మాత్రం సివిల్స్ వైపు వెళ్లాలనే ఆలోచన ఉంది. పేరెంట్స్‌ను అడగ్గానే ప్రొత్సహించారు. నేను అనుకున్నట్లుగా పట్టుదలతో శ్రమించి కలెక్టర్ అయ్యాను. కలెక్టర్ కావాలనే ప్లాన్-ఏ ఆప్షన్ మాత్రమే ఉంది. ప్లాన్-బీ కోసం ఆలోచించలేదు. ఢిల్లీ ఐఐటీలో చదివిన సమయంలో కూడా సివిల్స్ గురించే ఆలోచన. చిన్నప్పుడు బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. ఇప్పటికీ బ్యాడ్మింటన్, టెన్నిస్ బాగా ఆడతాను. జిమ్, యోగా, మెడిటేషన్ నా దినచర్యలో భాగం. పనిఒత్తిడిని అధిగమించడానికి ఇవన్నీ నాకు అలవాటైపోయాయి. అమ్మాయిలు, మహిళలు కూడా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. మనోధైర్యమే మీ బలం.. బలగం.

ఆడవాళ్లం కదా అనుకుంటే..

మేము ఆడవాళ్లం కదా.. ఈ పనిని మేము చేయగలమా అనే అనుమానం అక్కర్లేదు. మగవాళ్లతో సమానంగా రాణించే శక్తి మహిళలకు ఉంది. వారిలో మనోధైర్యం నింపితే చాలు. అందుకే గృహిణులు, మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించాము. ఇతర రంగాల్లోనూ తర్ఫీదు పొందుతున్నారు. వారే స్వయంగా ఒక పెట్రోల్‌బంకును నిర్వహించే స్థాయికి ప్రొత్సహించాము. బంకు త్వరలోనే ప్రారంభమవుతుంది. ఎవరేం అనుకుంటారో అనే అపోహలు తొలగిపోవాలి. నేడు అట్టడుగు స్థాయి నుంచి దేశ రాష్ట్రపతి దాకా మహిళలే కీలకపాత్ర పోషిస్తున్నారు. చదువు ఉంటే ఏదైనా సాధించవచ్చు. జిల్లాలోని ప్రభుత్వ గురుకులాలు, కస్తూర్బా, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులను ప్రొత్సహించడానికి అనేక మార్పులు తీసుకొస్తున్నాం.

సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్



సంగారెడ్డి నూతన ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నూతన ఎస్పీగా పారితోష్ పంకజ్ రానున్నారు. రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే సంగారెడ్డి ఎస్పీగా పారితోష్ పంకజ్‌ను నియమించింది. 2020 బ్యాచ్‌కు చెందిన ఆయన కొత్తగూడెం ఓఎస్‌డీగా పని చేస్తూ సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

సంతృప్తినిచ్చింది : ఎస్పీ రూపేష్

ఇప్పటివరకు పనిచేసిన చెన్నూరి రూపేష్ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా బదిలీ అయ్యారు. 2023 అక్టోబరు 13న రూపేష్ సంగారెడ్డి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. రూపేష్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషిచేశారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించి గంజాయి, మత్తు పదార్థాల రవాణాను సమర్థవంతంగా అరికట్టారు. ఈ కారణంగానే ఆయనను యాంటీ నార్కొటిక్ బ్యూరో ఎస్పీగా ప్రభుత్వం నియమించినట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లాకు చెందిన రూపేష్ 2017 బ్యాచ్‌లో ఐపీఎస్‌గా భర్తీ అయి జగిత్యాల అదనపు ఎస్పీగా, పెద్దపల్లి ఎస్పీగా, సౌత్, ఈస్ట్, వెస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు నిర్వహించిన అనంతరం సంగారెడ్డి జిల్లాకు ఎస్పీగా వచ్చారు. అయితే జిల్లాలో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఎస్పీ రూపేష్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను సమర్థవంతంగా అరికట్టగలిగామని చెప్పారు. జిల్లా పోలీసులందరి సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

శనివారం ఇఫ్తార్: సాయంత్రం 6.30
ఆదివారం సహర్: ఉదయం 5.07

15 రోజులు.. రూ.69లక్షలు!

మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం కానుకలు, ఒడి బియ్యం, హుండీ లెక్కింపులు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రామాంజనేయుల ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో శివరామకృష్ణ భజన మండలి మహిళా సభ్యులు కానుకలను లెక్కించారు. రూ69,11,633 నగదు, 46 గ్రాముల బంగారం, 5.200 కిలోల వెండి, 14 క్వింటాళ్ల ఒడిబియ్యం, 14విదేశీ కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయి. ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల ఏడు వారాల జాతర పూర్తవగా, వేలా ది మంది భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఆదాయం కేవలం 15 రోజుల్లోనే సమకూరింది.

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

మెదక్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో మే 4న జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నీట్-2025 కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కోసం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధ్యాన్‌చంద్ చౌరస్తాలోని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, స్టేడియం దగ్గరలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షకు జిల్లా నుంచి వెయ్యి మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సెంటర్లలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం ఉన్నారు.



మెదక్ పట్టణంలో నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రీ ఫైనల్ పరీక్షను పరిశీలించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. విద్యాబోధన ఏలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. లక్ష్య సాధన కోసం శ్రమించాలని, భయం వీడి పట్టుదలతో చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చాన్నారు.

గర్ల్స్ హాస్టల్‌లో స్పై కెమెరా కలకలం

- హాస్టల్ ఎదుట విద్యార్థినుల ఆందోళన
- పోలీసుల అదుపులో నిందితుడు

పటాన్‌చెరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రవేటు గర్ల్స్ హాస్టల్‌లో స్పై కెమెరాను గుర్తించిన విద్యార్థినులు ఆందోళనకు దిగారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట పరిధిలోని మైత్రివిల్లాస్‌లో 2021 నుంచి బండారు మహేశ్వర్ లక్ష్మీ గర్ల్స్‌హాస్టల్‌ను నడుపుతున్నారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థినులు ఉంటున్నారు. శుక్రవారం విద్యార్థినులు రహస్య కెమెరాను గుర్తించారు. దీంతో, హాస్టల్ వద్ద ఆందోళన చేసిన విద్యార్థినులు అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ సీఐ నరేష్ కేసు నమోదు చేసి హస్టల్‌లో రహస్య కెమెరాను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మహేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



హాస్టల్ వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు


జాతీయ రహదారిపై బల్లట్‌లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నర్సాపూర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ పరిధిలో అనేక మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతుండడంతో పాటు మరెందరో క్షతగాత్రులు అవుతున్న విషయాన్ని గుర్తించిన పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు నర్సాపూర్ పోలీసులు జాతీయ రహదారిపై ప్రమాదకర మలుపులు, అటవీ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు కొండాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 15 కిలోమీటర్ల మేర రోడ్డు మధ్యలో వాహనాల వేగాన్ని నియంత్రించేలా బల్లట్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ లింగం మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ తాము మలుపులు, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నచోట బల్లట్‌లను ఏర్పాటు చేశామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగు మృతిచెందారు. ఈ సంఘటన మెదక్, హవేళిఘణపూర్, గజ్వేల్, నర్సాపూర్, శివ్వంపేట మండలాల పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నాయి.

మెదక్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందగా.. మరో వ్యక్తి గాయాలైన సంఘటన సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన ఆకుల నర్సింలు మధ్యాహ్నం 1 గంటలకు గాంధీనగర్ నుంచి బైక్‌పై పట్టణంలోకి వస్తూ.. సబ్ రిజిస్టార్ కార్యాలయం వద్ద యూటర్న్ తీసుకుంటున్నాడు. న్యూబస్టాండ్ వైపు వేగంగా గాంధీనగర్ వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. నర్సింలు ముఖానికి, కాళ్లకు, చేతులకు గాయాలు కాగా.. పిట్లంబేస్‌కు చెందిన కిరణ్(26) తీవ్ర గాయాలయ్యాయి. కిరణ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు.

కమాన్ పైకప్పు కూలడంతో..

హవేళిఘణపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటిక కమాన్‌ను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. మెదక్ మండలం మంబోజిపల్లినికి చెందిన సయ్యద్ మునవర్(21) క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. గురూవారం అర్ధరాత్రి హవేళిఘణపూర్ గ్రామ శివారులోని పోచమ్మగుడి సమీపం నుంచి మట్టిని టిప్పర్‌లో తీసుకెళ్తూ.. శ్మశానవాటిక కమాన్‌ను ఢీకొట్టాడు. కమాన్ పైకప్పు పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. తల్లి ముంతాజ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ...

గజ్వేల్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మహిళ


కిరణ్(ఫైల్), సయ్యద్ మునవర్(ఫైల్), భువనగిరి బాలమణి(ఫైల్)

మృతిచెందింది. మండల పరిధిలోని రంగంపేట గ్రామానికి చెందిన భువనగిరి బాలమణి(35)కి ఇద్దరు పిల్లలు. బాలమణి భర్త భువనగిరి నర్సింలు గురువారం రాత్రి మొక్కజొన్నకు పందులు వస్తున్నాయని చుట్టూ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుచేసి ఊరికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం బాలమణి మోటార్ స్టార్ట్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమ కూతురు మృతికి కారణమైన అల్లుడు నర్సింహులుపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి బాలనర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

నర్సాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన నర్సాపూర్-వెల్దురి ప్రధాన రోడ్డుపై శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం.. నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని జరుకుల రామోజీ(50) శుక్రవారం తెల్లవారు జామున పొలంలో పనులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై తీవ్రగాయాలతో పడిపోయాడు. రోడ్డుపై నిల్చున్న మరో వ్యక్తి గమనించి రామోజీని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

హత్నూర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగింది. మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన చాకలి శివకుమార్(25) సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం సాయంత్రం బస్సును స్కూల్‌లో పెట్టి బైక్‌పై హత్నూరకు వస్తున్నాడు. మల్కాపూర్ గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో 108 అంబులెన్సులో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి చాకలి యాదమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

శివ్వంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భార్య మృతిచెందడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ్వంపేట మండలం పాంబండకు చెందిన గుమ్మల శేఖర్ భార్య 10 ఏళ్ల క్రితం మృతిచెందడంతో.. నాయనమ్మ పోచమ్మతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కాగా పోచమ్మ ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రికి వెళ్లగా.. ఇంట్లో ఉన్న శేఖర్ శుక్రవారం ఉదయం 11.45 గంటలకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి తండ్రి శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


ఏసప్ప

కోహీర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యమైన సంఘటన కోహీర్ మండలం బడంపేట గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సజ్జాపురం ఏసప్ప ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య పూలమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల కష్టాలు పాలకులకు పట్టవా..?

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్/మనోహరాబాద్/వట్‌పల్లి/నారాయణఖేడ్/శివ్వంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల కష్టాలు పాలకులకు పట్టవా అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ప్రశ్నించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర సరుకులు ధరల్లో విపరీతంగా పెరిగిపోయాయని, పెరిగిన ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, నాయకులు రాజయ్య, బాగారెడ్డి, యాదగిరి, కొండల్ రెడ్డి, ప్రసన్నరావు తదితరులు పాల్గొన్నారు. మూడునెలల జీతాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అలాగే వట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. నారాయణఖేడ్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ డివిజన్ కార్యదరిశ నల్లవల్లి రమేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. శివ్వంపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డికి జీపీ కార్మికులు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చేగుంట/వెల్దుర్తి/కల్హేర్/చిలప్‌చెడ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశామని మక్కరాజుపేట గ్రామ ప్రత్యేక అధికారి అమర్ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలు, మక్కరాజుపేటలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే మండల కేంద్రమైన వెలుర్తిలోని ప్రభుత్వ బాలుర హాస్టల్, కస్తూర్బా పాఠశాలలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి, డీటీడీవో నీలిమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్, కస్తూర్బా పాఠశాలల్లో తరగతి గదులతో పాటు వంటశాల, వంట సామగ్రి, స్నానపు గదులు, మూత్రశాలలు, ఆవరణలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, కస్తూర్బా ఎస్‌వో ఫౌతిమా, బాలుర హాస్టల్ వార్డెన్ నవీన్ ఉన్నారు. మండల కేంద్రమైన కల్హేర్‌లోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని కల్హేర్ ఎంపీడీవో రమేష్ బాబు శుక్రవారం తనిఖీ చేశారు. చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ కస్తూర్బా పాఠశాల, చండూరు ప్రాథమిక పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, వంట గదిని, స్టోర్‌రూం లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ఆనంద్, ఏపీవో శ్యాంకుమార్, సిబ్బంది ఉన్నారు.

పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవాలు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం


పోలేరమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న పురోహితులు, భక్తులు

వట్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి మండలంలోని షాదనగర్‌లోని పోలేరమ్మ ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హోమం నిర్వహించారు. అమ్మవారికి మహంకాళి మహాలక్ష్మి, మహా సరస్వతి, పార్వతి పరమేశ్వరుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి ఉపాసకులు దత్తాత్రేయస్వామి, అరవింద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

హత్నూర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూరలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీతా రామచంద్రస్వామి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మాధవానంద సరస్వతి స్వామీజీ చేతులమీదుగా ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


టేక్మాల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాదులూర్ గ్రామంలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గంగి రాజేందర్ ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆసుపత్రిపై దాడి కేసులో ఆరుగురికి రిమాండ్

సంగారెడ్డి క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని వెల్‌నెస్ ఆసుపత్రిపై దాడిచేసిన ఘటనలో ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. కోహీర్ మండలం మద్రికి చెందిన మహానందిని గతనెల 28 వెల్‌నెస్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరగా.. మార్చి 1న మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువులు ఆసుపత్రిపై దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆరుగురు నిందితులను గుర్తించి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

ఫస్టియర్ పరీక్షకు 523 మంది గైర్హాజరు

సంగారెడ్డి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 54 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 18,594 మందికి 18,071 మంది హాజరుకాగా, 523 మంది గైర్హాజరయ్యారు. 97.19 హాజరుశాతం నమోదైంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, షాహీన్, శ్రీతేజ జూనియర్ కళాశాల కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ సందర్శించారు.














ఆమె.. అన్నింటా..

నేడు అంతర్జాతీయ మహిళాదినోత్సవం

మహిళా శక్తి అమోఘం. ఒకరు తనలోని వైకల్యాన్ని జయించి.. తనలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారు. మరొకరు అంతరించిపోతున్న చేతి వృత్తిని వ్యాపారాత్మకంగా మార్చి అంత్రపెన్యూర్‌గా ప్రశంసలు అందుకుంటున్నారు. ఓ డాక్టర్ విశ్రాంతి ఉద్యోగానికే కాని.. సేవకు కాదని నిరూపిస్తున్నారు. ఇలా ఎందరో మహిళామణులు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అందరికీ వందనం..



తనలాంటి వారికి అండగా..

అంగవైకల్యం ఉన్నా.. నలుగురికి ఉపాధి మార్గం

కంది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం.. కుటుంబాన్ని చూస్తే పూట గడవడం కూడా కష్టమే. ఇలాంటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని.. నలుగురికి ఉపాధి కల్పించేస్థాయికి ఎదిగారు జుబేదా.. తనలాంటి దివ్యాంగులు ఆత్మగౌరవంగా బతకడానికి ఓ మార్గం చూపించారామె. సంగారెడ్డి మండలం కల్పగూరుకు చెందిన జుబేదా తల్లిదండ్రులు ఖాజామియా, బిస్మిల్లాబీ నిరుపేదలు. నలుగురు అక్కాచెల్లెళ్లు, ఓ తమ్ముడు. పుట్టుకతోనే కాలికి పోలియో సోకినా దిగులు చెందలేదు. ఓపెన్ డిగ్రీ పూర్తి చేసిన ఆమె తనలాంటి దివ్యాంగులకు ఏదైనా చేయాలనే సంకల్పంతో వికలాంగుల చైతన్య కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని దివ్యాంగులను ఏకం చేసి, 2001లో దివ్యాంగులకు ఇంటి స్థలాలు కావాలని 2001లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడును కలిసి, వినతిపత్రం ఇచ్చారు. అధికారుల చుట్టూ తిరిగి ఎట్టకేలకు 2003లో కందిలో దాదాపు 300 మంది దివ్యాంగులకు ఇళ్ల పట్టాలు ఇప్పించారు. అక్కడ లక్ష్మీనగర్ కాలనీ ఏర్పాటుకు కృషి చేశారు. సంగారెడ్డిలో దివ్యాంగ్ సోలార్ సొసైటీని స్థాపించారు. అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ సంగారెడ్డి వెలుగు కార్యాలయంలో భవనం, కొంత మూలధనం ఏర్పాటు చేయగా, దివ్యాంగులకు సోలార్‌లైట్ల తయారీలో శిక్షణ ఇప్పించారు. ఒంటరి మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించారు. ఇక్కడి నుంచి జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టి పంపిస్తున్నారు. ఆమె చేస్తున్న కృషిని అప్పటి గవర్నర్ తమిళిసై, మంత్రి దామోదర్ రాజనర్సింహా, కలెక్టర్లు ప్రశంసించడంతో పాటు అవార్డులూ అందజేశారు.



అన్నీ తానై..

జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు, ఒంటరి మహిళలు తమకు కష్టం వచ్చిందని జుబేదా ఇంటి తలుపు తడితే చాలు వారికి అన్నీ తానుగా మారుతున్నారు. దివ్యాంగులకు పింఛన్లు, సదరం సర్టిఫికెట్లు, ట్రై సైకిళ్లు, చేతికర్రలు, ఇంటి స్థలాలు, ఇల్లు కట్టుకోవడానికి రుణాలు ఇప్పిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. దివ్యాంగులు, ఒంటరి మహిళల సమస్యలు వినేందుకు రూ. ఏడున్నర లక్షలతో దివ్యాంగుల కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించారు. ఇక్కడే హెల్త్‌క్యాంపులు, సమావేశాలు నిర్వహిస్తారు. ఆత్మస్థైర్యం కోల్పోకుండా మనసు పెట్టి పని చేస్తే ఎంతటి కష్టాన్ని అయినా అధిగమించవచ్చునంటారు జుబేదా.

అవిశ్రాంత డాక్టర్..!

ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా సేవలు

రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా రిటైర్



నర్సాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా రెండేళ్ల విధులు నిర్వర్తించి రిటైర్ అయ్యారు. అంతటితో ఆగిపోకుండా తన మెట్టినిల్లయిన నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా ఉచితంగా సేవలు అందిస్తున్నారు డాక్టర్ వీణాకుమారి. తాను ఆస్పత్రిలో అందుబాటులో లేకపోయినా.. ఫోన్ చేస్తే చాలు సలహాలు ఇస్తూ పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారామె. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రముఖ కమ్యునిస్టు నేత కేవల్‌కిషన్ కుమార్తె అయిన డాక్టర్ వీణాకుమారి నర్సాపూర్‌కు చెందిన గోవర్ధన్‌ను వివాహం చేసుకున్నారు. ప్రభుత్వ డాక్టర్‌గా అంచెలంచెలుగా ఎదిగి 2016 నుంచి 2018 వరకు రాష్ట్ర కమిషనర్‌గా పని చేశారు. రిటైర్మెంట్ తర్వాత నర్సాపూర్‌లోనే ఉంటూ ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. డాక్టర్ వీణాకుమారి గైనకాలజీ స్పెషలిస్ట్ కావడంతో నర్సాపూర్ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ప్రసవ, మహిళలకు వైద్య సేవలు అందజేస్తున్నారు. దీంతో నర్సాపూర్‌తో పాటు నియోజకవర్గం నుంచి చాలా మంది గర్భిణులు ఆస్పత్రికి వస్తుంటారు. డాక్టర్ వీణాకుమారి చివరి వరకు సాధారణ ప్రసవాల కోసమే ప్రయత్నిస్తుంటారు. ఆమె అందిస్తున్న సేవలతో జిల్లాలోనే ఎక్కువ డెలివరీలు చేస్తున్న ఆస్పత్రిగా ప్రత్యేకతను చాటుకుంటోంది.

కూలి పనులకు వెళ్లలేక.. కళల వైపు

నకాశీ కళలో రాణిస్తున్న మంగ



నకాశీ ఫేస్‌మాస్క్‌లు తయారు చేస్తున్న పసుల మంగ

చేర్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తులకు కాలం చెల్లుతున్న రోజుల్లో పట్టుదల, ఏకాగ్రతతో నకాశీ చిత్ర కళారంగంలోకి వచ్చి.. స్వయంకృషిలో అంత్రపెన్యూర్‌గా మారింది. భర్త అడుగుల జాడల్లో నడుస్తూ తనలోని ప్రతిభతో ఒక్కో మెట్టే ఎక్కుతూ.. రైతు కూలీగా మారాల్సిన ఆమె రాష్ట్ర పెద్దలంతా ఆశీనులైన వేదికను పంచుకునే స్థాయికి ఎదిగింది చేర్యాల పట్టణానికి చెందిన పసుల మంగ. వేములవాడకు చెందిన ధనాలకోట వెంకటరామయ్య చేర్యాలలో స్థిరపడి నకాశీ చిత్రకళలకు పురుడుపోశారు. అతని కుటుంబ సభ్యుల వద్ద పసుల మల్లేశం, నాగిళ్ల గణేశ్‌లు శిక్షణ పొందారు. తర్వాతి రోజుల్లో వెంకటరామయ్య కుటుంబీకులంతా హైదరాబాద్‌కు వలస వెళ్లారు. దీంతో చేర్యాల నకాశీ వారసత్వ కళ అంతరించిపోతుందనుకున్న సమయంలో పసుల మల్లేశం, నాగిళ్ల గణేశ్ నకాశీ కళను బతికించే ప్రయత్నం చేశారు. అప్పటికీ వారి ఆర్థిక పరిస్థితి అంతంతే.. ఈ క్రమంలో పసుల మల్లేశం సతీమణి మంగ నకాశీ కళ నేర్చుకున్నారు. తనకున్న ప్రతిభతో కొద్దిరోజుల్లోనే మంచి పేరు తెచ్చుకున్నారు. మరో పక్క ప్రభుత్వ ప్రోత్సాహంతో అంత్రపెన్యూర్‌గా వీ హబ్‌లో అడుగుపెట్టారు. సంప్రదాయ కళకు వ్యాపార హంగులు అద్దారు. కళాత్మక ప్రయోగాలు ఎన్నో చేశారు దీంతో ఆర్డర్లు పెరిగాయి. పని ఒత్తిడి పెరగడంతో మరో పది మందికి శిక్షణ ఇచ్చి.. వారిని తనవద్దే నియమించుకున్నారు. దేశ విదేశాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి చేర్యాల ప్రాంతానికి పేరు తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే హస్తకళ ప్రదర్శనలో ఆమె ప్రతిభను చూసి గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, గత ప్రభుత్వ హయంలో మాజీ మంత్రి కేటీఆర్ తదితరులు అభినందించారు. అందరి మన్ననలతోపాటు మరెన్నో అవార్డులు అందకున్నారు మంగ.

బొమ్మలు చేస్తూ.. ప్రాణం పోస్తూ..

అభినవ శిల్పి

చెక్కబొమ్మల శకుంతల



చెక్కలతో బొమ్మలను తయారు చేస్తున్న శకుంతల

జహీరాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చెక్క ఆమె చేతిలో పడితే అపురూపమైన బొమ్మగా మారిపోతుంది. అందుకే శకుంతల కాస్త చెక్కబొమ్మల అనేది ఇంటిపేరుగా మారి చెక్కబొమ్మల శకుంతలగా మారిపోయింది. అంతగా చదువు లేకపోయినా.. తనకున్న ఆసక్తి మేరకు చెక్కబొమ్మల తయారీలో రాణిస్తూ దేశవిదేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని సుభాష్‌గంజ్‌కు చెందిన చెక్కబొమ్మల శకుంతల 25 ఏళ్లగా చెక్కబొమ్మలు తయారు చేస్తున్నారు. వాస్తవానికి ఆమె తల్లిదండ్రులది బీదర్ కాగా, వారు చెక్కబొమ్మలు తయారు చేస్తూ జీవనం సాగించేవారు. నిత్యం వారు బొమ్మలు తయారు చేయడం చూసిన శకుంతలకూ ఈ రంగంలో రాణించాలని ఆసక్తి పెరిగింది. తండ్రికి చెప్పడంతో ఆయన చెక్కబొమ్మల తయారీలో శిక్షణ ఇప్పించారు. తర్వాత జహీరాబాద్‌కు చెందిన నాగిశెట్టితో వివాహం జరగగా, భర్త సహకారంతో చెక్కబొమ్మలను తయారు చేస్తూ గుర్తింపు సాధించారు. దేవతామూర్తుల బొమ్మలతో పాటు కీచైన్లు, అగర్‌బత్తీ స్టాండ్లు, పూలకుండీలు తదితరాలు తయారు చేస్తూ దేశవిదేశాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో తన బొమ్మలను విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 3వేల ప్రదర్శనల్లో పాల్గొని అందరి మన్ననలు పొందారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఈ రంగంలో మరింత రాణిస్తానని, మహిళా కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు చెక్కబొమ్మల శకుంతల.



శకుంతల తయారుచేసిన బొమ్మలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఫైల్)

కష్టాలెదురైనా.. రైట్.. రైట్..

మెదక్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయంత్రం వరకు టికెట్.. టికెట్ అంటూ అరుపులు.. జనం మధ్యలో బస్సులో అటు నుంచి ఇటు తిరగడం మగవాళ్లకు పెద్ద కష్టం కాకపోయినా.. మహిళలకు పెద్ద కష్టమే. ఆటుపోట్లు ఎదురైనా రైట్.. రైట్ అంటూ మహిళా కండక్టర్లు తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిసున్నారు. బస్సులో ప్రయాణం ఎంత సురక్షితమో.. మహిళా ఉద్యోగుల (కండక్టర్ల) విధుల నిర్వహణ అంతే కష్టం. పనుల్లో ఎంత ఒత్తిడి ఉన్నా మనోధైర్యం తెచ్చుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణ ఆర్టీసీ డిపో పరిధిలో 43 మంది మహిళా కండక్టర్లు విధుల్లో కొనసాగుతున్నారు. రోజూ 16 గంటల వరకూ విధులు నిర్వహిస్తూ కుటుంబానికి పెద్దదిక్కు పాత్ర పోషించడం శభాష్ అనిపించుకుంటున్నారు.



మెదక్‌లో మహిళాకండక్టర్లు లంచ్ చేస్తున్న దృశ్యం

ఉద్యోగం తృప్తినిస్తోంది



సవాళ్లను ఎదుర్కొంటూనే.. కుటుంబానికి బసటగా నిలువడం తృప్తినిస్తోంది. విధులు నిర్వహించడానికి ముందే సిద్ధం కావాల్సి ఉంటుంది. తెల్లవారుఝాము 4 గంటలకే వంట చేసి, అత్తా మామలకు, పిల్లలకు టిఫిన్లు సర్ది. బస్సు రావడానికి ఒక గంట ముందే బస్టాండుకు చేరుకుంటా. నిత్యం 14 గంటల పాటు టిక్కెట్లు ఇస్తూ ప్రయాణికులను గమ్యస్థానానికి చేరుస్తున్నా. ఉద్యోగ జీవితంలో భర్త సహకారం ఉంది.

-స్వప్న, కండక్టర్, మెదక్

డ్యూటీలు చేసి అలసిపోతున్నా....



ఆటు పోట్లను ఎదుర్కొని కండక్టర్లుగా పని చేస్తున్నాం. డిపో మేనేజర్, ఇతర ఉద్యోగులు, భర్త సహకారంతో ఉద్యోగంలో ఇబ్బందులు లేవు. ఉదయం నుంచి రాత్రి వరకు డ్యూటీ చేయడంతో కొంత అలసిపోతున్నా. మహిళా దినోత్సవం సందర్భంగా మా డీఎం మహిళా కండక్టర్లకు సెలవు ప్రకటించడం ఆనందంగా ఉంది.

విజయలక్ష్మి, కండక్టర్, మెదక్



సమావేశంలో మాట్లాడుతున్న అంజలీయాదవ్

నామినేటెడ్ పదవుల్లో మహిళలకూ స్థానం

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలీయాదవ్

మెదక్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు నామినేటెడ్ పదవుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలీయాదవ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పారిశుధ్య కార్మికులు, స్టాఫ్‌నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ. 500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, డ్వాక్రా రుణాలు తదితర సౌకర్యాలు కల్పించిందన్నారు. మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. మహిళలతో జిల్లా కమిటీలు వేస్తామని తెలిపారు. మార్చి 8న రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళాదినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవానీ, మాజీ ఎంపీపీ అరుణ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి సులోచన, గోదల జ్యోతి, జిల్లా నాయకులు హరితా నర్సింగ్‌రావు, స్వరూప ఉన్నారు.




భువనగిరి ఎంపీతో పూజల హరికృష్ణ, మార్ఫింగ్ చేసిన తర్వాత

కాంగ్రెస్ నేత ఫోటో మార్ఫింగ్

పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

సిద్దిపేట క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఫొటోను కొందరు మార్ఫింగ్ చేశారని, ఎంపీ ఫొటో స్థానంలో మాజీమంత్రి హరీశ్‌రావు ముఖాన్ని మార్ఫింగ్ చేసి, హరికృష్ణ బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారంటూ గురువారం సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోటో మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళా, యూత్, కిసాన్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సిద్దిపేట వన్‌టౌన్, టుటౌన్, త్రీ టౌన్, చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పూజాల హరికృష్ణ రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక, ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖలీముద్దీన్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పదకొండు వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగు

రాయపోల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 11 వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు సాగు అవుతోందని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాకర్ శ్రీదేవి తెలిపారు. మండలంలోని మంతూరులో శుక్రవారం ఆమె పొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచలు చేశారు.

కస్తూర్బాలో బాలికను చితకబాదిన టీచర్



బాధిత బాలిక, తల్లి

కంగ్టి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పూల మొక్కలకు నీరు ఎందుకు పోయడం లేదని బెదిరిస్తూ 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఉపాధ్యాయురాలు చితకబాదడంతో చేతికి వాపు వచ్చి అస్వస్థతకు గురైంది. సంగారెడ్డి కంగ్టి మండల కేంద్రంలోని కేజీబీవీలో రెండ్రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. కస్తూర్బా కాలేజీకి కంగ్టికి చెందిన రాశి అనే విద్యార్థిని 9వ తరగతి చదువుతున్నది. బుధవారం రాత్రి విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలు సురేఖ విద్యార్థినులతో మొక్కలకు నీరు పోయడం, డ్రమ్ముల్లో నీరు నింపడం చేయించారు. కడుపునొప్పితో బాధపడుతున్న రాశి నీరు పోయలేనని చెప్పి నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు సురేఖ బాలికను తీవ్రంగా కొట్టింది. జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్న బాలిక తల్లిదండ్రులు శుక్రవారం కంగ్టికి వచ్చిన సందర్భంగా కూతురిని కలిసేందుకు పాఠశాలకు వెళ్లగా విషయం తెలుసుకొని బోరున విలపించారు. చదువుకునేందుకు పిల్లలను కేజీబీవీలో చేర్పిస్తే వారితో పనులు చేయించి శిక్షించడమేమిటని నిలదీశారు. రాశిని కొట్టిన సదరు ఉపాధ్యాయులకు శుక్రవారం విధులకు హాజరు కాకపోవడంతో ప్రత్యేకాధికారి విజయలక్ష్మితో వాగ్వాదానికి దిగారు. తమ కూతురితో పాటు మరో నలుగురు అమాయిలను సైతం ఉపాధ్యాయురాలు దండించిందని రాశి తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పునరావృతం కాకుండా చూస్తాం : ఎంఈవో రహీమొద్దీన్


ఈ విషయంపై ఎంఈవో రహీమోద్దీన్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా ఉపాధ్యాయురాలు విద్యార్థినిని దండించిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై ఎస్‌వోతో మాట్లాడగా పొరపాటున జరిగిందని తెలిపారన్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

పరిమళించనున్న పాతికేళ్ల బంధం

ఏకం చేసిన వాట్సాప్- రేపు జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో మెగా సమ్మేళనం

గురువులకు సన్మానం - భారీ ఏర్పాట్లు

గజ్వేల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల బంధం పరిమళించనుంది. 25 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థిలోకం అంతా ఒక్కచోట చేరనుంది. ఇందుకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జీఎంఆర్‌పాలిటెక్నిక్ గురుకుల కళాశాల వేదిక కానుంది. 1988లో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో అప్పట్లో ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. రాష్ట్రంలోనే టాప్ విద్యాసంస్థగా పేరు గడించింది. ఈ కళాశాలలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీస్ కోర్సులున్నాయి. తొలిరోజుల్లో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సు కూడా ఉండేది. అప్పట్లో ఇది ఓ మారుమూల ప్రాంతం. అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత గొప్పగా కనీవినీ రీతిలో అభివృద్ధికి నోచుకుంది. స్వయాన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతనిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కూడా ఈ గజ్వేలే కావడంతో కళాశాల ఆవరణలో బాలుర ఎడ్యూకేషన్ హబ్ ఏర్పాటైంది.



గజ్వేల్‌లోని జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

కలిపిన వాట్సాప్

టెక్నికల్ విద్యను అభ్యసించిన విద్యార్థులను టెక్నాలజీ మరోసారి ఒకటి చేసింది. ఇక్కడ చదువులు పూర్తి చేసుకుని ఎక్కడెక్కడికో చేరిన వారిలో కొంత మంది అప్పుడప్పుడు కలిసేవారు. అయితే, వాట్సాప్ వచ్చిన తర్వాత ఒక్కొక్కరుగా గ్రూపులో చేరి ఒకే వేదికపైకి వచ్చారు. తోటి స్నేహితుల కుటుంబాలు కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ధైర్యాన్ని చెబుతూ మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తున్నారు.

పట్టణంలో గురువులతో భారీ ర్యాలీ

1988 నుంచి చదువుకున్న విద్యార్థులలో 25ఏళ్లు నిండిన పూర్వ విద్యార్థులు ఆదివారం గెట్ టూ గెదర్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్నారు. ఈ కార్యక్రమానికి చదువులు చెప్పిన అధ్యాపకులను ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి ఆహ్వానం పలికారు. వారు కూడా తమ పిల్లల్లాంటి విద్యార్థులను మనసారా కలుసుకుని మరోసారి దీవించేందుకు రానున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం భారీ ఏర్పాట్లు చేశారు. గజ్వేల్ మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజీ వరకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తారు.



వాహనాల స్క్రాపింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు

చందాపూర్‌లో వాహనాల స్క్రాపింగ్ ప్లాంట్

ప్రారంభించిన జిల్లా రవాణాశాఖ అధికారి

వర్గల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందాపూర్ వద్ద రాష్ట్రంలోనే రెండో పెద్ద వాహనాల స్క్రాపింగ్ ప్లాంట్ ప్రారంభమైంది. దీనిని జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు శుక్రవారం ప్రారంభించారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఆమోదంతో ఏర్పాటు చేస్తున్న ఈ స్క్రాపింగ్ ప్లాంట్‌కు రిజిస్ట్రేషన్ లేని, ఫిట్‌నెస్ కానీ వాహనాలు, వివిధ సందర్భాల్లో దెబ్బతిన్న, 15 ఏళ్ల గడువు ముగిసిన వాహనాలను స్క్రాపింగ్ చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా రవాణా అధికారి కొండల్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు వాతావరణ సమతుల్యత కాపాడేందుకు కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ చేసే చట్టాన్ని కఠినతరం చేశాయని వివరించారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం అందించేందుకు కాలం చెల్లిన వాహనాల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు దాటిన, కండిషన్ లేని వాహనాలతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అలాంటి వాహనాలను స్క్రాప్ చేయాలన్నారు. గడువు మీరిన వాహనాలను స్క్రాప్ చేస్తే ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహిల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్, అడిషనల్ ఎంవీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఏసీపీ వెంకటరెడ్డి, అంబ ర్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్లు గిరీష్‌కుమార్, హరి గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భెల్ ఫ్లై ఓవర్ ప్రారంభం

పరిశీలించిన ఎంపీ రఘునందన్

రామచంద్రాపురం టౌన్ మార్చి 7(ఆంధ్రజ్యోతి): భెల్ కూడలిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ త్వరలో ప్రారంభం కానుందని ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హెడీ కుమార్‌స్వాములు హాజరవుతారని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ఫ్లైఓవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భెల్ కూడలిలో రెండు వైపులా వంద అడుగుల వెడల్పులో రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లింగంపల్లి కూడలిలో ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించాలని, వంతెన కింది భాగంలో మొక్కలతో అలంకరణ చేయడంతో పాటు అంబేడ్కర్ విగ్రహం పరిసరాల్లో పార్క్ నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ఎంపీ అధికారులకు సూచించారు. అనంతరం బీహెచ్‌ఈఎల్ జీఎంతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, జాతీయ రహదారుల అభివృద్ధి మండలి డీఈ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వండి

సంగారెడ్డి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి విద్యుత్ నిరంతరంగా ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వ్యవసాయానికి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. బోర్ మోటార్లలో హఠాత్తుగా మంటలు చెలరేగి కాలిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, నయకులు శ్రీనివాస్, మాణిక్‌రెడ్డి ఉన్నారు.

19వ రోజుకు దీక్ష

నర్సాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లిలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 19వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షలో పట్టణంలోని 5వ వార్డుకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ కౌన్సిలర్ సురేష్ ఆధ్వర్యంలో వార్డుకు చెందిన పలువురు నిరసన వ్యక్తం చేశారు. వీరికి సంఘీభావంగా మాజీ ఎంపీపీ రమణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహం పునఃప్రతిష్ఠాపన

సంగారెడ్డి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని కల్వకుంటలో శ్రీ దుర్గామాత విగ్రహాన్ని పునఃప్రతిష్ఠాపన ఆలయ కమిటీ నిర్వాహకుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా శాంతిపాఠం, గురువందనం, గోపూజ, మండప ప్రవేశం, అఖండ దీపారాధన చేశారు.

మృతుడి కుటుంబానికి గ్రామస్థుల చేయూత

కంగ్టి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలో ఇటీవల పిచ్చికుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన మెండె శ్రీకాంత్‌రెడ్డి(24) కుటుంబానికి గ్రామస్థులు చేయూతనందించారు. తండ్రిని కోల్పోయి, దివ్యాంగురాలైన తల్లికి ఆసరాగా ఉంటున్న శ్రీకాంత్ మృతితో ఒంటరైన హనుమవ్వకు రూ.55 వేల నగదు అందజేశారు.

డప్పుల ప్రదర్శన

మెదక్ కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాందాస్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణను స్వాగతిస్తున్నాం.. కానీ వర్గీకరణలో లోపాలు ఉన్నాయని వాటిని పునః సమీక్షించి, సవరణ చేసి తక్షణమే చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చెట్లపల్లి యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అస్తరగల్ల బాలరాజ్, సర్కుల పరశురాములు పాల్గొన్నారు.

అమ్మాయి చదువు ఇంటికి వెలుగు

- మహిళల సమానత్వం ఇంటి నుంచే ప్రారంభమవ్వాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


పుల్‌కల్: సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నాగమణి

సంగారెడ్డి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అమ్మాయి చదువు ఆ ఇంటికి వెలుగులనిస్తుందని, తల్లిదండ్రులు తమ అమ్మాయిలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ మంచి విద్యనందించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సమానత్వం అనేది ముందు మన ఇంటి నుంచే ప్రారంభమవ్వాలని, ఇంట్లో మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా చూడాలన్నారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో మహిళలకు సరైన గౌరవం భద్రత కల్పించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, డీఆర్డీఏ పీడీ జ్యోతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి పాల్గొన్నారు.

లింగ వివక్షకు విరుగుడు కళలు, క్రీడలు

ఫోటోరైటప్.7.ఎస్ఆర్‌డి.16. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఎంఎన్ఆర్ క్యాంపస్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న వక్తలు

సంగారెడ్డి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : లింగ వివక్షకు విరుగుడు కళలు, క్రీడల్లో భాగస్వాములవ్వడమేనని ప్రముఖ క్రికెటర్ జయసింహ సతీమణి జయంతి జయసింహ, సినీ నటి అశ్రిత వేముగంటి నండూరి అభిప్రాయపడ్డారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని ఎంఎన్ఆర్ క్యాంపస్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఆర్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ రవి వర్మ, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ డా.ఉష, డా.రవి, డీన్ డా.కిరణ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్‌తోనే మహిళా సాధికారత

పుల్‌కల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకంగా రిజర్వేషన్ల ద్వారానే మహిళా సాధికారికత సాధ్యమవుతుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.నాగమణి అన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించినప్పుడే అసమానతలు తొలగిపోతాయన్నారు. ఈ పోటీలో గెలుపొందినవారికి బహుమతులను అందజేశారు.

స్త్రీలను గౌరవించాలి

చేగుంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్త్రీలను గౌరవించాలని కాంగ్రెస్ నాయకుడు, సంఘ సేవకుడు అయిత పరంజ్యోతి అన్నారు. చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దశంకరంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెద్దశంకరంపేటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శ్రీవాణి, స్వప్నకుమారిని తహసీల్దార్ గ్రేస్‌బాయి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశం పాల్గొన్నారు.

దొంతిలో...

శివ్వంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండల పరిధి దొంతి గ్రామంలో జోన్ లయన్స్ క్లబ్ బాలానగర్ ఈలైట్ 320 డాక్టర్ విశ్వనాథం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధరంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యురాలు సాయి సౌమ్య, గ్రామీణ కృషి విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, హెచ్ఎం నర్మద పాల్గొన్నారు.

మహిళా విద్యావేత్తకు సన్మానం



సంధ్యారాణిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌చౌదరి, మహిళా టీచర్లు

మెదక్ అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యకురాలు అంజలి యాదవ్ పేర్కొన్నారు. ప్రపంచ మహిళ దినోవత్సాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడులకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...కాంగ్రెస్ సర్కార్ అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, నర్సులను ఘనంగా సన్మానించారు.

ఉత్తమ మహిళ విద్యావేత్త అవార్డు గ్రహితకు సన్మానం

పట్టణంలోని సిద్ధార్థ్ విద్యాసంస్థలల్లో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం గత వారం సిద్ధార్థ్ విద్యా సంస్థల ప్రిన్సిపల్ సంధ్యారాణికి ఉత్తమ మహిళ విద్యావేత్త అవార్డు అంజేసింది. ఈ సందర్భంగా సంధ్యారాణిని విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మంత్రి కోసం కల్యాణలక్ష్మి చెక్కులు ఆపడం విడ్డూరం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలో సుమారు 400 వరకు కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరై నెలలు గడుస్తున్నా.. వాటిని మంత్రి వచ్చేవరకూ ఇవ్వమంటూ అధికారులు కాలయాపన చేయడం విడ్డూరంగా ఉన్నదని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి వాపోయారు. శుక్రవారం నర్సాపూర్‌లోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చినవి వెంటనే ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ తమ చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే మంత్రి చేతులమీదుగా పంపిణీ చేయడానికి ఆపుతున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఇక్కడి అధికార పార్టీ నాయకులు కేవలం వారి రాజకీయ ప్రయోజనాలు తప్పా ప్రజలు, నియోజకవర్గ సమస్యల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బబియానాయక్, సత్యంగౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం' అమలు చేయాలి: ఎమ్మెల్యే


ధర్నాలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలుచేస్తూ.. దళితుల ఖాతాల్లో వెంటనే రూ.12 లక్షల చొప్పున జమచేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖేడ్ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, వినతిపత్రం అందజేసి, రాజీవ్ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దళితబంధు పథకంలో భాగంగా దళితుల ఖాతాల్లో రూ.3 లక్షల చొప్పున జజమచేయగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వెనక్కి తీసుకుందని ఆరోపించారు. ఆ నిధులను దళితుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రుబీనాబేగంనజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, ఖేడ్, మనూరు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు పరమేష్, విఠల్‌రావు, మాజీ కౌన్సిలర్లు స్వప్నఅభిషేక్‌షెట్కార్, విఠల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నగేష్, గోపాల్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సేవా దృక్పథం ఉండాలి

- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్


వృద్ధురాలికి చేతి కర్రను అందజేస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరిలో సేవా దృక్పథం ఉండాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని సత్యసాయి నిలయంలో భగవాన్ సత్యసాయిబాబా 100వ జన్మదినోత్సవంలో భాగంగా స్థానిక సేవాసమితి ఆధ్వర్యంలో వృద్ధులకు చేతి కర్రలు, వసతి గృహంలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేసి మాట్లాడారు. భగవాన్ సత్యసాయిబాబా మానవ సేవయే, మాధవ అని అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాడన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి జిల్లా కన్వీనర్ శంకరప్ప, స్థానిక కన్వీనర్ హనుమారెడ్డి, టీపీసీసీ శంకరయ్యస్వామి, భక్తులు పాల్గొన్నారు.

మినీ స్టేడియానికి భూమి కేటాయింపు


భూమి అప్పగింత ధ్రువపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్

హత్నూర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన హత్నూరలో మినీ స్టేడియం ఏర్పాటుకు భూమిని కేటాయిస్తూ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారికి అప్పగించినట్లు తహసీల్దార్ పర్వీన్ షేక్ తెలిపారు. గ్రామ శివారులోని సర్వే నెంబరు 106లో గల 4 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని స్టేడియం నిర్మాణానికి కేటాయించామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఖాసింబేగ్, జూనియర్ అసిస్టెంట్ అభినయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ అహ్మద్, జూనియర్ అసిస్టెంట్లు అభినయ్ కుమార్, నారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం

హవేళిఘణపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ రూరల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. శుక్రవారం హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లిలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీటీఆర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ప్రజలకు ఎల్లవేళాలా విద్యుత్ అందించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ల మార్పునకు ట్రాఫిక్ మళ్లింపు



రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

రామచంద్రాపురం టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం లింగంపల్లి కూడలిలో మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చేశారు. పటాన్‌చెరు వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా వంతెన పైనుంచి వెళ్లేటట్టు చర్యలు తీసుకున్నారు. చందానగర్ నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లే వాటిని సైతం నేరుగా వంతెన పైనుంచి పంపారు. అమీన్‌పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలను బెల్ కూడలి వద్ద యూటర్న్ తీసుకొని పటాన్‌చెరు వైపు వెళ్లి అశోక్‌నగర్ యూటర్న్ తీసుకొని వంతెన పైనుంచి ప్రయాణం చేసేటట్టు ఏర్పాట్లు చేశారు.

ఉపాధిహామీ పని కల్పించాలి


ఫీల్డ్ అసిస్టెంట్ వద్దంటూ ఎంపీడీవో సుధాకర్‌కు విన్నవించుకుంటున్న కూలీలు

ఝరాసంగం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకంలో తమకు కూలీ పనులను కల్పించాలని శుక్రవారం మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది ఉపాధిహామీ కూలీలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కప్పాడ్ గ్రామానికి చెందిన వ్యక్తిని తమ గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించడంతో తమకు సరిగా కూలీ పనులను కల్పిచడం లేదన్నారు. నెలరోజుల నుంచి పని లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆ ఫీల్డ్ అసిస్టెంట్ తమ గ్రామానికి వద్దని ఎంపీడీవో సుధాకర్‌కు మొరపెట్టుకున్నారు. ఈసీ ప్రతాప్‌రెడ్డి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు ఓడీఎఫ్ విద్యార్థుల ఎంపిక

కంది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని ఆయుధ కర్మాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జయంతి వాణి, గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి చెందిన సారిక, 7వ తరగతికి చెందిన సృష్టి, 8వ తరగతికి చెందిన జాదవ్ కరణ్, 9వ తరగతికి చెందిన పావని ఈ అవార్డుకు ఎంపికైనట్లు వారు తెలిపారు. విద్యార్థులను సైన్స్ ఉపాధ్యాయులు విజయభాస్కర్, కనకదుర్గ, ఇతర ఉపాధ్యాయులు రవీందర్, సంధ్య అభినందించారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మునిపల్లి/వెల్దుర్తి/వట్‌పల్లి/టేక్మాల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బుదేరా ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఎంఈవో భీంసింగ్, హెచ్ఎం సురేందర్, ఉపాధ్యాయులు అశోక్, గోపాల్, శ్రీలత అభినందించి బహుమతులు అందజేశారు. మండల కేంద్రమైన మునిపల్లి ప్రైమరీ స్కూల్‌లో, మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక పాఠశాలలో, వట్‌పల్లి మండలం గొర్రెకల్ ప్రాథమిక పాఠశాలలో, మండల కేంద్రమైన టేక్మాల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

లోక్ అదాలత్‌లో 9 కేసులు రాజీ

అల్లాదుర్గం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసుల్లో రాజీపడటం జరిగిందని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, జ్యుడీషియల్ మొదటి తరగతి న్యాయాధికారి సాయి ప్రభాకర్ సమక్షంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 9 పాత కేసుల్లో రాజీపడ్డారు. 44 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడగా.. ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : 'నీటి సమస్య పరిష్కరించాలని నిరసన' ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు కార్యదర్శి వెంకటేష్ మండల పరిధిలోని బోజ్యతండా, పంచాయతీ పరిధి మాల్యాతండాలో టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. దీంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు.

'ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి'


ఇందిరానగర్ శివారులో ఎండిన పంటలను పరిశీలిస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చేందర్

కల్హేర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు అంతరించిపోయి యాసంగి పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎండిన పంటలకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుర్రపు మశ్చేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని క్రిష్టాపూర్, ఇందిరానగర్, మార్డి, కల్హేర్ గ్రామ శివారుల్లో ఎండిన వరి, జొన్న పంటలను శుక్రవారం పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ అమ్ర్యానాయక్, నాయకులు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

నారాయణఖేడ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పంటలను సాగుచేసిన ప్రతీ రైతు వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద తాము సాగుచేసిన పంటల వివరాలను విధిగా నమోదు చేయించుకోవాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. శుక్రవారం నారాయణఖేడ్ మండలం ర్యాకల్ శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి జొన్న, వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం జొన్న పంటకు పెనుబంక తెగుళ్లు, వరిలో కాండం తొలుచు, మోగి పురుగులు ఆశించినట్లు గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సస్యరక్షణ కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించి చర్యలను చేపట్టాలన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

జిన్నారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం మాధారం ప్రభుత్వ పాఠశాల లోని 33 మంది విద్యార్థినులకు హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూపు సంస్థ సైకిళ్లను అందజేసింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు కృష్ణాగౌడ్, పద్మజ, సుధారాణి, స్వరూపారాణి, సత్యనారాయణ, హన్మన్న, రాజేశ్వర్, బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు మార్చి లోపు పూర్తి చేయాలి

- డీపీవో యాదయ్య



ఎల్ఆర్ఎస్ బ్యానర్‌ను పరిశీలిస్తున్న డీపీవో యాదయ్య

చేగుంట మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లను మార్చిలోపల పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. శుక్రవారం చేగుంట మండలంలోని అనంతసాగర్, చేగుంట, మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి, మండల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్-2020 పథకంలో భాగంగా ప్రభుత్వం మార్చి 31లోపు 25 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకోవాలన్న అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్ను వసూలు, మంచినీటి సరఫరా, గ్రామ పారిశుద్యం, డంపింగ్‌యార్డు, నర్సరీలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎంపీవో ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు నరేష్, సిబ్బంది లింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు


కంది మండలం ఎర్దనూర్‌లో పనిచేయని మంచినీటి నల్లాల వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కంది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు విమర్శించారు. కంది మండలంలోని ఎర్దనూర్ గ్రామంలో శుక్రవారం సీపీఎం పర్యటించి సమస్యలు తెలుసుకున్నది. కొన్నిరోజులుగా మంచినీరు అందడం లేదని గ్రామస్థులు సీపీఎం నాయకులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథనీరు ఏడాదిగా సరిగ్గా రావడం లేదన్నారు. ఈ ఊరి దగ్గరలో ఉన్న కంకర క్రషర్లకు చెందిన భారీ వాహనాలు తిరగడం వలన గ్రామంలో పైపులు పగిలిపోయి లీకేజీలు ఎక్కువ అయ్యాయని ఆయన ఆరోపించారు. ఎర్ధనూర్ గ్రామంలో మంచినీటి ఎద్దడిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సింలు, మండల కన్వీనర్ ఎస్.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య

రాయికోడ్/సంగారెడ్డి రూరల్/రేగోడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య అన్నారు. శుక్రవారం రాయికోడ్ మండల పరిధిలోని ఆదర్శ గ్రామమైన నాగ్వార్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే తెలంగాణ మోడల్ స్కూల్ గురుకుల బాలికల పాఠశాల కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, ఎంపీడీవో ఎంఎం.షరీఫ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాలాజీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో యాదగిరిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సంగారెడ్డి మండల అధ్యక్షుడు బుచ్చిరాములు, ఏపీఎం, హౌసింగ్ శాఖ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను మెదక్ హౌసింగ్ డీఈ యాదగిరి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట ఏఈ విద్యాసాగర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు ఉన్నారు.


నాగ్వార్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న అంజయ్య